నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, ఆదివారం 6 అక్టోబర్ 2024 | KAMAREDDY



# వడ్డేపల్లిలో విషాదం

- కుటుంబాన్ని బలిగొన్న బెట్టింగ్
- కుమారుడితో సహా తల్లిదండ్రుల ఆత్మహత్య



వడ్డేపల్లిలో వివరాలు సేకరిస్తున్న సీఐ విజయ్‌బాబు, ఎస్సై వంశీకృష్ణారెడ్డి

ఎడపల్లి, అక్టోబర్ 5: మండలంలోని వడ్డేపల్లిలో తీవ్ర విషాదం నెలకొన్నది. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు ఓ కుటుంబం బలైంది. బెట్టింగ్‌లో రూ.లక్షలు పోగొట్టిన కుమారుడితో పాటు తల్లిదండ్రులు ఆత్మహత్య చేసుకున్నారు. ఎస్సై వంశీకృష్ణారెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రంగణవేణి సురేశ్ (55), హేమలత (48) దంపతుల కుమారుడు హరీశ్ (22) మొన్నటిదాకా నిజామాబాద్‌లో ఉంటూ పెట్రోల్ బంక్‌లో పని చేసేవాడు. ఆర్నెళ్ల క్రితం పని మానేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. సురేశ్ దంపతులు చిన్న కిరాణ షాపు నడుపుతూ వ్యవసాయ కూలీలుగా పని చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. సొంతిల్లు నిర్మించుకోవాలన్న ఆశతో ఇటీవలే నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే, కుమారుడు హరీశ్ ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడి భారీగా అప్పులు చేశాడు. ఇంటి నిర్మాణాన్ని నిలిపివేసిన తల్లిదండ్రులు.. హరీశ్ చేసిన రూ.30 లక్షలకు పైగా అప్పులు కట్టేందుకు తమకున్న 20 గుంటల భూమిని అమ్మేశారు.

అయినప్పటికీ కుమారుడిలో కొంచెమైనా మార్పు రాలేదు. కష్టపడి పనిచేసి గౌరవంగా బతుకుతున్న ఆ కుటుంబం.. నలుగురిలో తిరగలేక మనస్తాపానికి గురైంది. తల్లిదండ్రులతో పాటు కుమారుడు సైతం శుక్రవారం రాత్రి వారు అద్దె కుంటున్న ఇంట్లో ఉరేసుకున్నారు. తెల్లారినా వారు బయటికి రాకపోవడంతో పక్కింటి వారు వెళ్లి పిలిచారు. డోర్ కొట్టినా స్పందన లేకపోవడంతో ఇంటి వెనుక నుంచి చూడగా వేలాడుతూ కనిపించడంతో పోలీసులకు సమాచామిచ్చారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బోధన్ దవాఖానకు తరలించిన పోలీసులు కేసు నమోదు చేశారు.

# వైద్యాధికారులు సమయపాలన పాటించాలి

**కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్**



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, అక్టోబర్ 5 : వైద్యాధికారులు సమయపాలన పాటించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. ప్రభుత్వ జనరల్ దవాఖానను కలెక్టర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దవాఖానలో డాక్టర్ల హాజరు రిజిస్ట్ర్‌ను పరిశీలించారు. ఉదయం 9.45 గంటల వరకు కూడా పలువురు వైద్యులు విధులకు హాజరు కాకపోవడాన్ని కలెక్టర్ పరిశీలించారు. వైద్యులు సకాలంలో రావాలని సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో రంగనాథ్‌రావు, తహసీల్దార్ జనార్దన్ ఉన్నారు.


**క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి**

క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సీఎం కప్ 2024 టార్చ్ రిలే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. సీఎం కప్-2024 టార్చ్ రిలే శనివారం కామారెడ్డికి చేరుకోగా, కలెక్టర్ స్వాగతం పలికారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో రంగనాథ్ రావు, డీఎస్పీ రాజేశ్వర్ రావు, జిల్లా యువజన సంక్షేమ అధికారి జగన్నాథం, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందూ ప్రియ, కమిషనర్ సుజాత పాల్గొన్నారు.



జిల్లాలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. భిక్కనూరు మండలం జంగంపల్లిలో శనివారం దీపార్చన కార్యక్రమం నిర్వహించారు. దీపాల వెలుగుల్లో దేవీ మండప పరిసరాలు కోటి కాంతులతో తళుకులీనాయి.

# జనం నెత్తిన నిడ్రా





- ఆక్రమణల తొలగింపు తథ్యం
- కూల్చివేతల్లో బంధుప్రీతి ఉండదు
- బాంబు పేల్చిన పీసీసీ చీఫ్ మహేశ్
- పులాంగ్ పరీవాహక ప్రాంత వాసుల్లో భయం
- అమలు తీరుపై అనేక అనుమానాలు

*హైదరాబాద్‌లో హైడ్రా తరహాలో నిజామాబాద్‌లో నిడ్రా తీసుకొచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. ఆక్రమణల తొలగింపు పేరిట రాజధాని వాసుల్లో వణుకు పుట్టించిన సర్కారు.. ఇందూరులోనూ బుల్డోజర్లకు పని చెప్పే దిశగా పావులు కదుపుతున్నది. ఈ అంశాన్ని ఎవరో కాదు, స్వయంగా పీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ వెల్లడించారు. నిడ్రాను ఏర్పాటు చేస్తామని చెప్పారు. దీంతో వాగులు, చెరువుల వెంట ఇండ్లు నిర్మించుకున్న వారిలో కలకలం మొదలైంది. హైడ్రా తరహాలోనే నిడ్రా కూడా పేదల ఇండ్లను కూల్చే ప్రమాదముందన్న భయాందోళన వ్యక్తమవుతున్నది. మొత్తంగా పీసీసీ చీఫ్ వ్యాఖ్యలు జిల్లాలో ప్రకంపనలు రేపుతున్నాయి.*

*-నిజామాబాద్ అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

**హైడ్రా తరహాలోనే** నిజామాబాద్‌కు త్వరలోనే నిడ్రా వస్తుందని పీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ జోస్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత సొంత జిల్లా నిజామాబాద్‌కు తొలిసారి వచ్చిన ఆయన.. శనివారం జిల్లా కేంద్రంలో విలేకరులతో నిర్వహించిన చిట్‌చాట్ సందర్భంగా పలు కీలక వ్యాఖ్యలు చేశారు. హైడ్రాపై పలువురు ప్రశ్నలు గుప్పించగా నిడ్రా అవసరాన్ని నొక్కి చెప్పారు. ఆక్రమణల కూల్చివేతలు తప్పదని, అందులో తన సొంత తమ్ముడు, బంధువులున్నా కూల్చివేతలు ఖాయమన్నారు.

**ఉలికిపాటు..**

పీసీసీ చీఫ్ పేల్చిన నిడ్రా బాంబుతో నగర వాసుల్లో ఉలికిపాటు మొదలైంది. ముఖ్యంగా పులాంగ్ వాగు తీవ్రమైన ఆక్రమణలకు గురైంది. ఇందులో కాంగ్రెస్ సానుభూతిపరులు, హస్తం నేతలకు ప్రత్యక్ష సంబంధం ఉంది. ఈ దశలో నిడ్రా ఏర్పాటైతే కూల్చివేతల పర్వం పులాంగ్ నుంచే మొదలవుతుందా.. లేదంటే ఇతర ప్రాంతాలను ఎంచుకుని ముందుకెళ్తారా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. నిడ్రాను నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తారా.. హైడ్రా తరహాలో స్వతంత్ర హోదాతో రంగంలోకి దింపుతారా? అన్న స్పష్టత ప్రస్తుతానికి లేదు.

**కాంగ్రెస్ హయాంలోనే ఆక్రమణలు..**

నగరంలోని రామర్తి చెరువు కబ్జాలపై ఇటీవల జోరుగా చర్చ నడుస్తున్నది. ఎఫ్‌టీఎల్ పరిధిలో పదుల సంఖ్యలో ఇళ్లు వెలిశాయి. వానకాలంలో ఈ జనావాసాలను చెరువు నీళ్లు చుట్టేస్తున్నాయి. పదేండ్ల క్రితం నాడు కాంగ్రెస్ పాలకులే ఆక్రమణలను పెంచి పోషించారు. ఇందులో హస్తం నేతలే ప్రధాన కారకులుగా ఉన్నారు. ఇప్పుడు నిడ్రా పేరుతో నగరంలో కూల్చివేతలు మొదలు పెడితే రామర్తి చెరువు నుంచే ప్రారంభించాలన్న డిమాండ్ వినిపిస్తున్నది. వాగులు, చెరువులను కాపాడేందుకు నడుం బిగిస్తే ముందుగా కాంగ్రెస్ పాలకుల హయాంలో కబ్జాలకు గురైన కుంటలు, జలాశయాల్లోనే కూల్చివేతలు మొదలు పెట్టాల్సి ఉంది.

**కక్ష సాధింపులుంటాయా?**

మొత్తంగా పీసీసీ చీఫ్ వ్యాఖ్యలు నిజామాబాద్ జిల్లా రాజకీయాల్లోనూ దుమారం రేపుతున్నాయి. మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకున్న ప్రతిపక్ష పార్టీలు.. ఎవరిని టార్గెట్‌గా చేసుకుని నిడ్రాను తీసుకు రానున్నారనే అంశంపై దృష్టి సారించాయి. ప్రతిపక్షాలపై రాజకీయ కక్ష సాధింపునకే ఇదంతా జరుగుతుందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తానికి నిడ్రా అవసరంపై పీసీసీ అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలతో వాగులు, చెరువుల వెంట ఇళ్లు నిర్మించుకున్న వారిలో భయాందోళనలు రేకెత్తిస్తుండగా, రాజకీయంగానూ ప్రకంపనలు రేపుతున్నది.



**హైడ్రాను జిల్లాలకు విస్తరిస్తాం..**

హైడ్రాను జిల్లాలకు విస్తరిస్తాం. ఆ తరహాలోనే నిజామాబాద్‌లోనూ చర్యలు చేపట్టే అవకాశాలు ఉంటాయి. హైడ్రాను ఆపితే మరో వయనాడ్ అవుతుంది. హైడ్రా అనేది ఒక మహా యజ్ఞం, అది ఆగకూడదు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే ఎంతటి వారైనా వదిలిపెట్టం. మా కుటుంబ సభ్యులు కబ్జా చేసినా కూల్చేయండి.

**- మీడియా చిట్‌చాట్‌లో బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్, పీసీసీ చీఫ్**

**నిడ్రా ఎవరి వైపు..?**


హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన హైడ్రా ముఖ్యంగా పేదల పాలిట గుదిబండగా మారింది. దీంతో ఈ వ్యవస్థపైనే విమర్శలు వెత్తుతున్నాయి. కోర్టు కేసులు, ఆందోళనలు, కూల్చివేతలు, పేదల నిరసనల మధ్య హైడ్రా పనితీరు కొనసాగుతున్నది. హైడ్రా కూల్చివేతల పర్వం పలు జిల్లాల్లోనూ మొదలైంది. ఈ నేపథ్యంలో నిజామాబాద్‌కు సైతం నిడ్రా అవసరమని కాంగ్రెస్ అధ్యక్షుడే స్వయంగా చెప్పడంతో ఇందూర్‌లోనూ కూల్చివేతలు తప్పవని తేలిపోయింది. నిడ్రా అవసరమే కానీ అది పేదల జోలికి వెళ్లనంత వరకే. పేదల ఇండ్లు కూల్చివేతలు మొదలు పెడితే ఇబ్బందులు తలెత్తడం ఖాయం. పులాంగ్ వాగు చుట్టూ అనేక ప్రాంతాల్లో బఫర్ జోన్ కబ్జాలకు గురైంది. ఇందు లో పలు కమ్యూనిటీ సంఘాలు, ప్రముఖుల ఇండ్లు కూడా ఉన్నాయి. వాగుకు అడ్డంగా గోడలు నిర్మించుకుని సైతం దర్జాగా ఆక్రమణలకు పాల్పడ్డారు. అలాంటి వారికి నిడ్రా తగిన గుణపాఠం చెబుతుందని ఓవైపు హర్షం వ్యక్తమవుతుండగా, మరోవైపు బఫర్ జోన్ పేరుతో పేదల ఇండ్లపైకి బుల్డోజర్లు పంపితే వ్యతిరేకత వెల్లువెత్తడం ఖాయమన్న భావన వ్యక్తమవుతున్నది. గూపన్‌పల్లి ప్రాంతంలో వందలాది పేద కుటుంబాలు ఇండ్లు కట్టుకుని నివసిస్తున్నాయి. ముబారక్‌నగర్ శివారులోనూ ఇదే పరిస్థితి. గంగాస్థాన్ ఫేజ్-1లో ఒక పేరు మోసిన గేటెడ్ కమ్యూనిటీ సైతం బఫర్ జోన్‌లోనే ఉన్నట్లు ప్రచారం ఉంది. నిడ్రా రాక నేపథ్యంలో వీటి భవితవ్యం ఏమిటనే చర్చ మొదలైంది.

# మూగ జీవాల మృత్యుఘోష

- ప్రబలుతున్న వింత వ్యాధి
- ఐదు రోజుల్లో 13 ఆవులు మృతి
- పట్టించుకోని పశువైద్యాధికారులు



టీకారం తండాలో వ్యాధి సోకి మృతి చెందిన దూడ



పెద్ద కొడప్‌గల్, అక్టోబర్ 5: వింత వ్యాధితో మూగ జీవాలు మృత్యువాత పడుతున్నాయి. ఐదు రోజుల వ్యవధిలోనే 13 ఆవులు మృతి చెందాయి. పెద్దకొడప్‌గల్ మండలంలో వ్యాపిస్తున్న ఈ వ్యాధి పశువుల యజమానులను కలవరపెడుతున్నది. టీకారం తండాలో పరిస్థితి రోజురోజుకూ దిగజారుతున్నది. ఇక్కడ వారంలో 13 ఆవులు, 2 దూడలు చనిపోయాయి. అయినా ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. పశువైద్యాధికారులు పట్టించుకోవడం లేదని తండా వాసులు వాపోతున్నారు. గోపాల మిత్రలకు చూపించినా ఫలితం లేకపోయింది. రైతులు 1962కు కాల్ చేస్తే కొందరు వచ్చి చూసి వెళ్లిపోయారు. ఆ తర్వాత నుంచి రోజుకు ఒకటి, రెండు ఆవులు మృత్యువాత పడుతూనే ఉన్నాయి.

**విస్తరిస్తున్న వ్యాధి తీవ్రత**


తండాలో400లకు పైనే ఆవులు ఉండగా, వ్యాధి క్రమంగా విస్తరిస్తున్నది. ఒక్క మోహన్‌సింగ్‌కు చెందిన 15 జీవాలు వారం వ్యవధిలో చనిపోయాయి. పశువుల శరీరం నిండా దద్దుర్లు ఏర్పడి, పుండ్లుగా మారి జీవాలు నరకయాతన అనుభవిస్తున్నాయి. మేత తినలేక, నడువలేక నీరసించి మృత్యువాత పడుతున్నాయి. కండ్ల ముందే తమ పశువులు కనుమూస్తుండడంతో రైతులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. మరోవైపు, పాలిచ్చే ఆవులు చనిపోతుండడంతో పాల ఉత్పత్తిపై ప్రభావం పడుతున్నది. ఎన్నిసార్లు ఫోన్ చేసినా ప్రభుత్వ వైద్యులు రావడం లేదని పశు పోషకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక వెటర్నరీ డాక్టరీ పండరినాథ్‌కు గురువారం ఫోన్ చేస్తే, శుక్రవారం శిబిరం ఏర్పాటు చేస్తామని చెప్పారన్నారు. కానీ రెండ్రోజులుగా ఇటువైపు రాలేదని మండిపడుతున్నారు. ప్రభుత్వం పట్టించుకోక పోతే జీవాలన్నీ జీవచ్ఛవాలుగా మారుతాయని యజమానులు ఆందోళన చెందుతున్నారు. పశు వైద్య శిబిరం ఏర్పాటు చేసి తమ ఆవులను కాపాడాలని విన్నవిస్తున్నారు. మరోవైపు, వ్యాధి తీవ్రత, నివారణ, శిబిరాల ఏర్పాటుపై వివరణ కోరేందుకు స్థానిక పశు వైద్యాధికారి పండరినాథ్‌కు 'నమస్తే తెలంగాణ' ఫోన్ చేయగా, ఆయన స్పందించలేదు.

**పట్టించుకుంటలేరు..**



మా తండాలో ఆవులకు ఏ వ్యాధి వచ్చిందేమో అర్థమైతలేదు. నాకు 60 దాకా ఆవులు ఉన్నాయి. అందులో రోజుకు ఒకటి, రెండు చొప్పున సచ్చిపోతున్నాయి. ఈ వారంల 13 ఆవులు, 2 దూడలు సచ్చిపోయినయ్. పశువుల డాక్టర్‌కు చెబితే పట్టించుకుంటలేడు. ప్రైవేట్ వైద్యులకు చూపించినా వ్యాధి తగ్గుతలేదు. ఉన్నతాధికారులు స్పందిస్తేనే మా జీవాలు మాకు దక్కుతాయి. లేకుంటే ఇప్పుడు మిగిలనవి కూడా సచ్చిపోతాయ్.

**- బర్దవాల్ మోహన్‌సింగ్, టీకారం తండా**



జిల్లాలో బతుకమ్మ సంబురాలు వైభవంగా సాగుతున్నాయి. నాలుగో రోజు నానేబియ్యం బతుకమ్మను పేర్చి మహిళలు, యువతులు ఆడిపాడారు. కామారెడ్డిలోని ఆర్‌కే కాలేజీ, ఎస్‌ఆర్‌కే, సాందీపని డిగ్రీ కళాశాలల్లో శనివారం బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థినులు బతుకమ్మ పాటలకు లయబద్ధంగా స్టెప్పులు వేస్తూ సందడి చేశారు.



# మేకల సంత కిటకట

**రూ.3 కోట్ల క్రయ విక్రయాలు**

నవీపేట, అక్టోబర్ 5: నవీపేట మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన మేకల సంత కిటకిటలాడింది. దసరా పండుగ నేపథ్యంలో రూ.3 కోట్లకు పైగా వ్యాపారం జరిగింది. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, రాజస్థాన్, హర్యానా, గుజరాత్ తదితర రాష్ట్రాల నుంచి వ్యాపారులు, కొనుగోలుదారులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ట్రాఫిక్ జామ్ అయింది. జీవాలతో వచ్చిన వాహనాలను పార్కింగ్ చేసేందుకు స్థలం సరిపోక నానా తంటాలు పడ్డారు. రోడ్డుపైనే జీవాలను విక్రయించడంతో ప్రయాణికులు, స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎస్సై వినయ్ సిబ్బందితో వచ్చి ట్రాఫిక్‌ను నియంత్రించారు.